ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 35, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

హరియాణా గవర్నర్ పరామర్శ



శ్యాంసుందర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

అమీర్‌పేట: బీజేపీ సీనియర్ నాయకుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అమీర్‌పేటలోని నివాసంలో శ్యాంసుందర్ గౌడ్‌ను ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ఎప్పటిలాగే ప్రజా సేవ చేయాలని ఆకాంక్షించారు.

'పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయండి'



వికాస్ యాదవ్, ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఓయూ నాయకుడు వికాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఓయూలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇండియా కూటమి విద్యార్థి విభాగాలతో కలిసి ఎన్ఈపీ–2020, యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో చాపకింద నీరుల విస్తరిస్తున్న కాషాయికరణను విద్యార్థిలోకం అడ్డుకోవాలని కోరారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

అడ్డగుట్ట: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని లక్ష్మీశ్రీనివాస్ పేర్కొన్నారు. అడ్డగుట్ట బీ సెక్షన్‌లో బీఆర్ఎస్ నాయకులు, బస్తీవాసులతో కలిసి పవర్ బోర్, సింటెక్స్ ట్యాంకును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో డివిజన్ పరిధిలో నీటి సమస్యను గుర్తించి ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్, నర్సింగ్, అమర్, పొన్నాల రాజు, అయోధ్య, మల్లేశ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన బైక్‌తో జంప్

బంజారాహిల్స్: ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ కింద శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్‌ప్లేట్ లేకుండా వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. సదరు వాహనదారుడి వద్ద ధ్రువపత్రాలు లేకపోగా నెంబర్‌ప్లేట్ కూడా లేకపోవడంతో ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ ఖాజామియా బైక్‌ను సీజ్ చేసి రోడ్డు పక్కన పెట్టాడు. వాహన తనిఖీల్లో పోలీసులు బిజీగా ఉండగా అదును చూసిన స్కూటరిస్టు పోలీసుల కళ్లు గప్పి సీజ్ చేసిన బైక్‌తో ఉడాయించాడు. ఎస్ఐ ఖాజామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఏపీ 25 ఏఏ 2628 నెంబర్ వాహనంతో ఉడాయించిన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని పబ్‌పై కేసు

బంజారాహిల్స్: గడువు ముగిసిన తర్వాత కూడా పబ్ తెరిచి ఉండడమే కాకుండా డీజే సౌండ్‌తో స్థానికంగా న్యూసెన్స్‌కు పాల్పడిన పబ్ యాజమాన్యం, మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–36లో కొనసాగుతున్న ఎంకే వేర్‌హౌస్ పబ్‌లో శనివారం రాత్రి గడువు ముగిసిన తర్వాత కూడా భారీ శబ్దంతో డీజే వినిపిస్తుండటంతో పోలీసులు ఫిర్యాదు అందుకుని తనిఖీలు నిర్వహించారు. పోలీసులు వెళ్లిన సమయంలో కూడా పబ్ తెరిచి ఉండటమే కాకుండా హై మ్యూజిక్‌తో డీజే ప్లే చేస్తూ శబ్ద కాలుష్యాన్ని కారణమైన పబ్ యాజమాన్యంతో పాటు మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

జాతి యోధులకు ఘన నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: భారత జాతి యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30 వరకు జాతి యోధుల వర్ధంతి వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డా..!

- లష్కర్ ఓయూ, రైల్వే క్వార్టర్లు
- నిర్వహణ లేక నిరుపయోగం
- ఇదే అదునుగా అల్లరిమూకలు, మందుబాబుల తిష్ట



తార్నాక మెట్రో స్టేషన్ సమీపంలో నిరుపయోగంగా ప్రభుత్వ క్వార్టర్లు

సికింద్రాబాద్: లష్కర్ ప్రాంతంలోని ఉస్మానియా యూనివర్సిటీ, రైల్వే ఉద్యోగుల క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటుండడంతో రాత్రి సమయాల్లో అల్లరిమూకలు భవన సముదాయాల్లోనే ఉంటూ ఆయా మార్గాల గుండా వచ్చేవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

వందలాది నివాసాలు..

మెట్టుగూడ డివిజన్ తార్నాక మెట్రోస్టేషన్ ప్రాంతంలోని ఓయూ ఉద్యోగుల క్వార్టర్లు, ఇదే డివిజన్ పరిధిలోని రైల్వే ఉద్యోగుల క్వార్టర్లు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. నాటి నుంచి వాటి నిర్వహణ లేక కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని క్వార్టర్ల పైకప్పులు కూలిపోయి మొండిగోడలకే పరిమితం అయ్యాయి. దీంతో ఇందులోని కుటుంబాల వారు బయటకు వెళ్లిపోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంటున్నాయి.

పదేళ్లుగా ఖాళీ..

ఓయూ, రైల్వే క్వార్టర్లను పదేళ్ల క్రితమే మొత్తం ఖాళీ చేశారు. అప్పటి నుంచి వీటి నిర్వహణ బాధ్యతలు చూసుకునేవారే కరువయ్యారు. ఇటు ఓయూ, అటు రైల్వే అధికారులు శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకుంటున్నారు. మరోవైపు ఖాళీ భవన సముదాయాలు ఇక్కడి పోలీసులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సెక్యూరిటీ, సీసీ కెమెరాలు లేకపోవడంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మార్చుకుంటున్నారు. నేరాలు జరిగిన సందర్భాల్లో కేసును ఛేదించడం, నిందితులను అదుపులోకి తీసుకోవడం ఓయూ, తుకారాంగేట్, చిలకలగూడ, లాలాగూడ, తుకారాంగేట్ పీఎస్‌ల పోలీసులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. రైల్వే క్వార్టర్స్‌లో హత్యలు, లైంగికదాడి జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. నిరుపయోగంగా ఉంటున్న ప్రభుత్వ భవన సముదాయాల ప్రాంతాల్లో మళ్లీ నేరాలు పునరావృత్తం కాకముందే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిరంతర సేవలు



తాడ్‌బండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: మానవసేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో నెలకొల్పిన శ్రీ గణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో తాడ్‌బండ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 9.4 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేసిందన్నారు. దీనికి అదనంగా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మరో రూ.5 కోట్ల నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అలాగే రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొవ్వొత్తి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మక్తల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జలంధర్‌గౌడ్ పేర్కొన్నారు. మక్తల ఫౌండేషన్ గ్రీనరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ సందర్భంగా సోమసుందరం వీధి, జనరల్‌బజార్, అంజలి థియేటర్ తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. భూమిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతానని, మొక్కలు పెంచుతానని, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గిస్తానని, పర్యావరణానికి హాని కలిగించే వాటిని వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకాశ్, భాస్కర్, వెంకటేశ్, వెంకటచారి, ఆంజనేయులు, రాజేశ్, కిరణ్, శ్రీనివాస్, నరేశ్, శ్రీధర్, రాంచందర్, క్రితిక్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ ఫ్లెక్సీలు చించివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి మహంకాళి పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంతో సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ సిటీలైట్ హోటల్ చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. అయితే కొంతమంది దుండగులు జీహెచ్ఎంసీ సిబ్బంది డ్రెస్ వేసుకుని అర్ధరాత్రి సమయంలో వాటిని చించివేశారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరుల ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు ఖమర్, నజరీన్, రమేశ్‌బాబు, మణికంఠ, సుధీర్, శివకుమార్, హేమంత్‌సింగ్ ఠాకూర్, రహీం, సురేశ్, నారాయణ, రాజేశ్వరి, అశ్విని, బుష్రా పాల్గొన్నారు.

మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర సమావేశం



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్‌లో మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర నాయకుడు చేపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కులస్తులందరు శాశ్వత సభ్యత్వం తీసుకోవాలన్నారు. మనందరం సంఘటితంగా ఉంటేనే సామాజిక ప్రగతికి మార్గం సుగమం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండు సతీశ్, ఏనుగుల హరీశ్, చామకూర సుజాత, అన్నపూర్ణ, దండు నరేందర్, లక్ష్మీప్రియ, జయశ్రీ, మంజుల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిదాయకం



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట మయూరిమార్గ్‌లో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఉస్మానియా యూనివర్సిటీ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి, యువత బెట్టింగ్‌లు, డ్రగ్స్, ఇతర వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ ముదిరాజ్, ఓయూ కాంగ్రెస్ నాయకులు వలిగొండ నరసింహ, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్'

లాలాపేట: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ బర్రె యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలు నిర్వర్తించకుండానే కేసీఆర్ 15 నెలలుగా జీతభత్యాల రూపంలో ప్రభుత్వ సొమ్ము తీసుకున్నాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సెక్రటేరియట్‌కు రాకుండా ఫాంహౌజ్ నుంచే పాలన సాగించారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా ఫాం హౌజ్‌కే పరిమితమై ప్రజాపాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను తన మాటలతో తప్పుదోవ పట్టిస్తూ మళ్లీ అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కనిపిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆయన సూచించారు.

క్రాస్ మసాజ్ చేస్తున్న స్పా సెంటర్‌పై కేసు

ఫిలింనగర్: నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మార్గాల్లో క్రాస్ మసాజ్ చేస్తున్న స్పా సెంటర్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్ రోడ్డు నెంబర్–5లో అర్బన్ రిట్రీట్ పేరుతో మసాజ్ పార్లర్ నిర్వహిస్తున్నాడు. అయితే వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్‌కు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదు అందుకున్న ఫిలింనగర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పలువురు యువతులు మసాజ్ థెరపిస్టుల పేరుతో క్రాస్ మసాజ్‌కు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో స్పా యజమాని అక్షయ్ బొహ్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేస్తున్న హోటల్‌లో చోరీ

బంజారాహిల్స్: యజమాని కళ్లు గప్పి పనిచేస్తున్న హోటల్‌లోనే చోరీకి పాల్పడిన నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదైంది. వివరాలివీ... ఒడిస్సాకు చెందిన సుభం సేతి(24) కొంతకాలంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని పంచెకట్టు దోశ రెస్టారెంట్‌లో పనిచేస్తూ ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల రెస్టారెంట్‌లో రూ. 20 వేలతో పాటు ల్యాప్‌ట్యాప్ చోరీ చేసి ఒడిస్సాకు పరారయ్యాడు. హోటల్ యజమాని సి.నాగభరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

ఘనంగా లోహియా జయంతి వేడుకలు



లోహియా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లాలాపేట: తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ కార్యాలయంలో డాక్టర్ రామ్ మనోహర్ లోహియా 115వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోహియా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ.. డా. బీఆర్ అంబేడ్కర్, పెరియార్‌తో కలిసి సామాజిక మార్పు కోసం లోహియా బాటల వేశారన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అంబేడ్కర్, లోహియా బాటలో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ స్పోక్స్ పర్సన్ ప్రొఫెసర్ వెంకటరాజయ్య, రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి ముదిరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మహ్మద్ వజీద్ సిద్దిఖీ, యూత్ బ్రిగేడ్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రిజ్వాన్ హుస్సేన్, గోవర్ధన్, సీనియర్ లీడర్ కొమ్ము తిరుపతి తదితరులు ఉన్నారు.

కంటోన్మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్‌హట్స్‌కు చెందిన పలువురు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ఆధ్వర్యంలో ఎంపీ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరగా ఈటల వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రక్షణ శాఖ స్థలంలో ఉంటున్న పేదలకు న్యాయం చేసేందుకు స్థల బదలాయింపు కింద ఆర్మీకి మరోచోట స్థలం కేటాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరినట్లు చెప్పారు. అలాగే మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ నగర్ గుడిసెవాసుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీఎన్. శ్రీనివాస్, భానుక మల్లికార్జున్, అశోక్‌సాంబ, అరుణ్, మధు, అసెంబ్లీ కన్వీనర్ వినోద, భాగ్యలక్ష్మి, అనురాధ, మధు పాల్గొన్నారు.

ఇక ఆహ్లాదంగా గాంధీ దవాఖాన!



గాంధీ ఆస్పత్రి ఓపీ విభాగం గోడలను శుభ్రం చేసి రంగులు వేస్తున్న సిబ్బంది

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని ఆహ్లాదకరంగా మార్చేందుకు పాలన యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇటీవల మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) నరేందర్ కుమార్ గాంధీ ఆస్పత్రిని సందర్శించగా అవుట్‌పేషెంట్, అత్యవసర, ఇన్ పేషెంట్ విభాగాలు, కారిడార్ల గోడలపై కిళ్లీ, గుట్కా మరకలు, తుప్పు పట్టిన కిటికీలు, విరిగిన తలుపులు, ప్రకటనల స్టిక్కర్లు, పోస్టర్లతో అధ్వానంగా కనిపించాయి. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే వార్డులు, విభాగాలు, కారిడార్లను శుభ్రం చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆస్పత్రి పాలన యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది ఆయా వార్డులు, విభాగాలతో పాటు కారిడార్లను శుభ్రం చేసి, గోడలు, కిటికీలు, తలుపులకు రంగులు అద్దుతున్నారు. ఆహ్లాదకరమైన రీతిలో ఆయా విభాగాలను తీర్చిదిద్దుతున్నారు. గాంధీ ఆస్పత్రి శుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆస్పత్రి పాలనా యంత్రాంగం పిలుపునిస్తోంది.

నిరుపేద ముస్లింలకు నిత్యావసరాల కిట్ల పంపిణీ



నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద ముస్లింలకు బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ చేయూతనందించారు. 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, అలాగే ముస్లిం మహిళలకు చీరలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ముస్లింలు సైతం పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే తనవంతుగా నిత్యావసర సరుకుల కిట్లను అందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణచైతన్య, చలం, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాంతినికేతన్ విద్యా సంస్థల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో శాంతినికేతన్ విద్యా సంస్థల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల గ్రూప్ డ్యాన్సులు, ఫోక్, సోలో డ్యాన్సులు, మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా రామకృష్ణ వలంటీర్ ఆరెపాటి వెంకట నారాయణ హాజరై విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శాంతినికేతన్ విద్యా సంస్థల యాజమాన్యాన్ని ప్రశంసించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు లివాంకర్ మణిశంకర్ మణికంఠన్, పాఠశాల ప్రతినిధులు శ్రీవిద్య, శ్రీధర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పాటు పడాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదయ్యనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోరాటానికి, దేశభక్తికి, త్యాగానికి నిలువెత్తు నిదర్శనం భగత్‌సింగ్ అని కొనియాడారు. మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా యువత ఎంతో స్ఫూర్తి పొందుతారన్నారు. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, నాయకులు నాగులు, రాములు, శ్రీకాంత్, ప్రమోద్, సత్యనారాయణ, అమర్, శ్రీనాథ్, నిర్వాహకులు నరేన్, లోకేశ్, వంశీకృష్ణ, మనోజ్, అంకిత్‌రెడ్డి, లక్ష్మణ్, టిల్లు, చందు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సత్యం థియేటర్ చౌరస్తాలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ, కట్ట బలరాం, అశోక్‌యాదవ్, సత్యనారాయణ, దర్శన్‌సింగ్, లాహోర్‌సింగ్, జోగిందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

లాలాపేట: ఆర్యనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు షహీద్ దివస్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకుడు కుమార్ షాను మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం చిన్న వయస్సులోనే ఉరికొయ్యలను ముద్దాడిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గణేశ్, బాబురావు, సురేందర్, యాదగిరి, నాగరాజు తదితరులు ఉన్నారు.

అమీర్‌పేటలో..

సనత్‌నగర్: అమీర్‌పేటలోని షహీద్ భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ సభ్యుడు సర్దార్ సురేందర్‌సింగ్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు సరాఫ్ సంతోష్‌కుమార్ పటేల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.